ప్రజాశక్తి
సోమవారం 14 అక్టోబర్ 2024



ర్యాలీ కోసం పడిగాపులు

రోడ్డు పక్కన పడిగాపులు కాస్తున్న మహిళలు

విజయనగరంటౌన్ : నగరంలో ఆదివారం నిర్వహించిన విజయ నగరం ఉత్సవాల ప్రారంభ ర్యాలీకి వచ్చిన పొదుపు సంఘాలు మహిళలు, అంగన్వాడీ కార్యకర్తలు పడిగాపులు కాశారు. ర్యాలీ కోసం ఉదయం ఏడు గంటలకు వచ్చేయాలని అధికారులు చెప్పడంతో వారంతా ఆ సమయానికే ఎంజి రోడ్డుకు చేరుకున్నారు. డివిజన్ల వారీగా మూడు లాంతర్ల కూడలి నుంచి కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు క్యూలో ఉంచారు. పది గంటల వరకు ర్యాలీ ప్రారంభం కాలేదు. దీంతో ఉదయం నుంచి వచ్చిన వారు టిఫిన్లు లేక, నీరు ఇచ్చే దాతలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

చరిత్రలో విజయనగరానికి సమున్నత స్థానం

- శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు
- ఘనంగా ప్రారంభమైన విజయనగరం ఉత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, కోట

విద్యలనగరంగా పేరొందిన విజయనగరానికి చరిత్రలో సమున్నత స్థానం ఉందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. విజయనగరం ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అయోధ్యా మైదానంలో జరిగిన ఉత్సవ ప్రారంభ కార్యక్రమానికి సభాపతి అయ్యన్నపాత్రుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనడం గర్వకారణమని ఆయన తెలిపారు. ఈ నేలలో నడయాడిన మహానుభావులు చేసిన సేవలను స్ఫురించుకుని నివాళులర్పించారు. మన ప్రాంత వైభవాన్ని, ఘన చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయ పడ్డారు. గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విజయనగరం గౌరవాన్ని, కీర్తిని నిలబెట్టడానికి ఈ ఉత్సవాలు దోహదం చేస్తాయన్నారు. ఊరంతా పండగ వాతావరణం నెలకొందని తెలిపారు. ఉత్సవ కమిటీ చైర్మన్, కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ 24వ సారి నిర్వహిస్తున్న ఈ విజయనగరం ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశామన్నారు. సభకు అధ్యక్షత వహించిన విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు మాట్లాడుతూ ఉత్సవాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ అంగరంగ వైభవంగా ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాన్సాస్ చైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజు, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్, జిల్లా అధికారులు, ఆయా వేదికల ఇన్‌ఛార్జులు, వివిధ పార్టీల ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ సైకత శిల్పాన్ని సందర్శిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, సంధ్యారాణి, కలెక్టర్

నగరానికి పండగ శోభ

విజయనగరం ఉత్సవాల ప్రారంభ ర్యాలీ నగరానికి పండగ శోభను తెచ్చింది. పైడితల్లమ్మ ఆలయం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ అయోధ్యా మైదానం వరకు సాగింది. కోలాటాలు, తప్పెటగుళ్లు, బిందెల నృత్యం, కర్రసాము, కత్తి సాము, విచిత్ర వేషాలు, వివిధ జానపద కళారూపాలు, ఒంటెలు, గుర్రాలు, దేశ నాయకులు, కవులు, కళాకారులు, సాహితీ వేత్తలు, విద్యార్థులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులతో సుమారు 55 బృందాలు ర్యాలీలో పాల్గొన్నాయి. ఈ ర్యాలీని అతిథులంతా కోట వద్ద నుంచి తిలకించారు. ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి ఈ ర్యాలీకి ఇన్‌ఛార్జిగా వ్యహరించారు.

పులివేషధారులతో మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి, కలెక్టర్ అంబేద్కర్, జెసి

పుష్ప ప్రదర్శన ప్రారంభం

విజయనగరంకోట : స్థానిక మాన్సాస్ గ్రౌండ్‌లోని అఖిలభారత డ్వాక్రా బజార్ వద్ద ఏర్పాటు చేసిన పుష్ప ప్రదర్శనను శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం ప్రారంభించారు. విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో పుష్పాలతో వివిధ థీమ్స్‌ను ఏర్పాటు చేసి ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను స్పీకర్‌తోపాటు మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తిలకించారు. జిల్లా ఉద్యానశాఖ డిడి జమదగ్ని, ఎడి శైలజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చరిత్రను చాటిచెప్పిన లేజర్‌షో

విజయనగరంకోట : విజయనగరం కీర్తిని, చరిత్రను నేటితరానికి తెలిసేలా లేజర్ షోను ఏర్పాటు చేసినట్లు కేంద్ర మాజీమంత్రి గజపతిరాజు అన్నారు. స్థానిక కోట వద్ద ఏర్పాటుచేసిన లేజర్‌షోను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి ఆయన తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయనగరం గత వైభవం నేటి తరానికి, భావితరాలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు చేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపి, ఎమ్మెల్యే

పైడిమాంబను దర్శించుకున్న ప్రముఖులు

విజయనగరం టౌన్ : పైడితల్లమ్మ వారిని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పూజారులు, అధికారులు అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని స్పీకర్‌కు అందజేశారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. పైడితల్లమ్మను చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, పూజారులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని బహుకరించారు.

అలరించిన శతాధిక కవి సమ్మేళనం

విజయనగరంకోట : విజయనగరం ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఎంఆర్ రిక్రియేషన్ క్లబ్‌లోని సాహిత్య వేదికపై ఆదివారం నిర్వహించిన పలు కార్యక్రమాలు సాహితీ ప్రియులను అలరించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనం, భువన విజయం ఆకట్టుకున్నాయి. మహారాజా సంస్కృత కళాశాల ప్రిన్సిపల్ గంటా జనార్ధన్ నాయుడు నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున కవులు సాహితీవేత్తలు పాల్గొని తమ సాహితీ ప్రతిభను ప్రదర్శించారు. శతాధిక కవి సమ్మేళనం కార్యక్రమాన్ని రత్నాల బాలకృష్ణ, చీకటి దివాకర్, సూర్యలక్ష్మి, మానాప్రగడ సాహితీ తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించగా, కవులు తమ కవితలను చదివి వినిపించారు. వారందరినీ జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. భువన విజయం కార్యక్రమానికి జక్కు రామకృష్ణ, కట్టమూరి చంద్రశేఖర రావు అనుసంధాన కర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.తిరుపతి నాయుడు, నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్, జిల్లా సహకార అధికారి రమేష్ తదితరులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

కవితలు చదువుతున్న కవులు

విద్యార్థి ఏర్పాటుచేసిన ప్రదర్శనను సందర్శిస్తున్న కేంద్రమాజీ మంత్రి అశోక్

విద్య, వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం

విజయనగరం టౌన్ : విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఎంఆర్ హైస్కూల్లో విద్యా శాఖ ఏర్పాటు చేసిన ఎపిజె అబ్దుల్ కలామ్ సైన్స్ ఫెయిర్‌ను జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ ఆదివారం ప్రారంభించారు. ఇందులో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు 210 వరకు ఏర్పాటుచేశారు. సైన్స్ ప్రదర్శనతోపాటు క్రాఫ్ట్, స్టాంపులు, నాణేల ఎగ్జిబిషన్, చిత్రలేఖ ప్రదర్శన, వీరసైనికులు చిత్రాలు, విజయనగరం విశిష్ట వ్యక్తులు చిత్రప్రదర్శన, పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనలు తయారు చేసిన విధానం, వాటి వల్ల ఉపయోగాలు ఏమిటి? అనేది జెసి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు సైన్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. కార్యక్రమంలో డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, విద్యాశాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మనోహరం.. నృత్యరూపకం

సుప్రియ బృందాన్ని సత్కరిస్తున్న ఎపిఆర్‌ఒ జానకమ్మ

విజయనగరంకోట : ఆనంద గజపతి ఆడిటోరి యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. నర్తనశాల విద్యార్థుల కూచిపూడి డ్యాన్స్ ఆహూతులకు కనువిందు చేసింది. పలు నృత్య కళాశాలల విద్యార్థుల శాస్త్రీయ సంగీతం.. క్లాసికల్ డ్యాన్స్.. భరత నాట్యం, భక్తి సంగీతం.. ఇలా ఒకటేమిటి అన్నీ కార్యక్రమాలు ప్రేక్షకుల హర్షధ్వానాలు అందుకున్నాయి. చిన్నారుల అభినయాలు ఆకట్టుకున్నాయి. నాదస్వరం, వీణ, వయోలిన్, మృదంగం, తబల తదితర వాయిద్యాలు వినసొంపుగా సాగాయి. అనంతరం కళాకారులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. వేదిక ఇన్‌ఛార్జులు బి.ఉమాశంకర్, జానకమ్మ ఆధ్వర్యాన ఈ కార్యక్రమాలు జరిగాయి.

అలరించిన జానపద కళ రూపాల ప్రదర్శన

లయన్స్ కమ్యూనిటీ హాలులోని ఆదిభట్ల నారాయణదాసు కళావేదికపై ప్రదర్శించిన జానపద కళారూపాలు, యుద్ధ క్రీడలు ఆహూతులను కట్టిపడేశాయి. తప్పెటగుళ్ళు, హరికథ, పులివేషాలు, జముకుల కథ, కోలాటం, బుర్రకథ వంటి జానపద కళారూపాలు ప్రేక్షకులను అలరించాయి. పద్మనాభం తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

కళాకారిణుల నృత్యప్రదర్శన

క్రీడాకారులతోనే ఆయా ప్రాంతాలకు గుర్తింపు

ఉత్సవ క్రీడా పోటీలను ప్రారంభించిన కేంద్రమంత్రి కింజరాపు

రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చిన్న చిన్న దేశాలు సైతం క్రీడల ద్వారా ప్రపంచంలో ఎంతో గుర్తింపు పొందాయని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. విజయనగరం ఉత్సవాల్లో భాగంగా స్థానిక విజ్జీ స్టేడియంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్తరాంధ్ర స్థాయి ఇన్విటేషన్ పోటీలను మంత్రి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన దేశ పేరు ప్రతిష్టలను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప చేసే శక్తి క్రీడాకారులకే ఉందన్నారు. క్రీడల ద్వారా మన ప్రాంతానికి, మన దేశానికి ఖ్యాతిని తీసుకురావడంతో పాటు క్రీడాకారులకు వ్యక్తిగత గుర్తింపు కూడా లభిస్తుందన్నారు. 40 ఏళ్ల క్రితం ఎంతో ముందుచూపుతో విజ్జీ స్టేడియంలో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను వినియోగించుకొని క్రీడల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేస్తామన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో మానసిక వికాసం కలుగుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడలకు పట్ల ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ అంబేద్కర్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు, ఆరు జిల్లాలు క్రీడాకారులు పాల్గొన్నారు.

కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారిణులు

పైడితల్లమ్మ ఆలయం

నేడు తొలేళ్ల ఉత్సవం

పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లమ్మ జాతరలో ప్రధాన ఘట్టమైన తొలేళ్ల ఉత్సవం సోమవారం అర్ధరాత్రి జరగనుంది. ఉదయం నుంచి ప్రజలు ఘటాలతో అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకోనున్నారు. ప్రభుత్వం రాష్ట్ర పండగగా ప్రకటించిన నేపథ్యంలో తొలేళ్ల ఉత్సవం సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. ఆలయ ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు కూడా అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తారు. తొలేళ్ల ఉత్సవం రోజున అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో యాత్రికులు తరలిరానున్నారు. ఈ సందర్భంగా అర్ధరాత్రి అమ్మవారి చదురుగుడి నుంచి వేద పండితులు మంత్రోత్సవాల మధ్య ఘటాలు మూడు లాంతర్లు మీదుగా కోట వరకు వాయిద్యాలు, పులివేషాలు నడుమ చేరుకుంటాయి. అక్కడ అమ్మవారి పూజారి పండగ విశేషాలను యాత్రికులకు వివరించనున్నారు. అనంతరం వరి విత్తనాలను చల్లనున్నారు. రైతులు ఆ విత్తనాలు తీసుకునేందుకు పోటీ పడుతుంటారు. ఆ విత్తనాలు పొలంలో నాటితే మంచి పంటలు పండుతాయని రైతుల నమ్మకం. ఈ సందర్భంగా నగరంలో జనం మేలుకొని ఉండటంతో వారికి వినోదాన్ని అందించడం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ప్రధానంగా యువత నగర వీధుల్లో సందడి చేయనున్నారు.

మద్యం షాపుల లాటరీకి పకడ్బందీ ఏర్పాట్లు

ఉదయం 8 నుంచి కలెక్టరేట్‌లో నిర్వహణ ● ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ అంబేద్కర్

విజయనగరం కోట : జిల్లాలో సోమవారం చేపట్టే మద్యం షాపుల లాటరీ ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించే ఈ ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లకు కూడా తావు లేకుండా చూడాలని చెప్పారు. కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో మద్యం షాపుల లాటరీ ప్రక్రియ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఆదివారం పరిశీలించారు. లాటరీ కోసం చేస్తున్న ఏర్పాట్లను ఎక్సైజ్ శాఖ డిసి కె.వి.వి.ఎన్. బాబ్జీరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు.. కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో 153 మద్యం దుకాణాలకు లాటరీ ప్రక్రియను సోమవారం ఉదయం 8 గంటల నుంచి నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామని వారు వివరించారు. మూడు స్లాట్లలో లాటరీ ప్రక్రియ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మొదటి స్లాట్‌లో 8 నుంచి 10 గంటల వరకు మొదటి 50 షాపులకు, రెండో స్లాట్‌లో 10 నుంచి 12 గంటల వరకు 51 నుంచి 100 షాపుల వరకు, మూడో స్లాట్‌లో మధ్యాహ్నం 12 నుంచి 101 నుంచి 153 షాపు వరకు లాటరీ ప్రక్రియ నిర్వహిస్తామని చెప్పారు. లాటరీ ప్రక్రియ నిర్వహణ కోసం 10 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని, ఒక్కో కౌంటర్‌లో తహశీల్దార్, ఎస్‌హెచ్ఒ వంతున ఇందులో 10 మంది తహశీల్దార్లు, పదిమంది ఎస్‌హెచ్ఒలు ఉంటారని వివరించారు. డ్రాలో మొదట ఒక్కో షాపునకు ఒక్కొక్క అభ్యర్థిని ఎంపిక చేస్తామని, ఆయనతోపాటు మరో ఇద్దరు రిజర్వుడ్ అభ్యర్థులను కూడా ఎంపిక చేస్తామని ఎక్సైజ్ అధికారులు వివరించారు. డ్రాలో ఎంపికైన అభ్యర్థి నిర్ణీత వ్యవధిలోగా లైసెన్స్ ఫీజు చెల్లించకుంటే రిజర్వులో ఉన్న అభ్యర్థికి షాపులను కేటాయిస్తామని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థి 24 గంటల్లోగా లైసెన్స్ మొత్తంలో ఆరో వంతు మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని, లేకుంటే ఎంపికను కోల్పోతారని ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనాథుడు తెలిపారు. ఈనెల 16 నుంచి ఎంపికైన వారు మద్యం దుకాణాలు తెరుచుకునేందుకు అనుమతిస్తామని చెప్పారు.

పరాభవం... ఉత్సవ ప్రారంభం

స్పీకర్, మంత్రుల ప్రసంగంలో వెలవెలబోయిన సభా ప్రాంగణం ● అడుగడుగునా సమన్వయ లోపం.. ప్రణాళిక లోపభూయిష్టం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అధికారుల సమన్వయ లోపం.... ప్రణాళిక లోపభూయిష్టం కారణంగా విజయనగరం ఉత్సవాల ప్రారంభ సభలో ఘోరపరాభవం ఎదురైంది. శాసనసభ స్పీకర్, రాష్ట్ర మంత్రులు మాట్లాడిన సభలో ఒక్కరంటే ఒక్కరూ లేకుండా వెళ్లిపోయారు. ఉత్సవాల్లోనే కాదు... విజయనగరం చరిత్రలోనే ఇటువంటి అనుభవం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఉత్తరాంధ్రుల కల్పవల్లిగా భావించే విజయనగరం పైడితలమ్మ పండగ ఏటా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దీనికి అనుబంధంగా రెండు రోజులపాటు విజయనగరం ఉత్సవాలు కొన్ని దశాబ్దాలుగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వాలు మారిన తొలి ఏడాదైతే మరింత పోటీగా నిర్వహించడం, ఆదేరీతిలో ఈ ప్రాంత వాసులు, కళాకారులు, కళా, సంగీత, సాహితీ ప్రియులు భాగస్వామ్యం కావడం ఉత్సవ ఆదరణకు అద్దం పట్టేది. ఇటువంటి పరిస్థితుల్లో కేవలం నేటి ఉత్సవాల కోసమే ఎదరు చూసే వారెందో..! ఇంతటి ప్రాధాన్యత గల ఉత్సవ ప్రారంభ సభ తుస్సుమనేలా సాగడం విజయనగరం వాసుల్లో ఒకింత నిరుత్సాహాన్ని నింపింది.

ఈ నెల 13, 14వ తేదీల్లో విజయనగరం-2024 ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు నెల రోజులు ముందే ప్రకటించారు. అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశం కాని రోజు లేదంటే అతిశయోక్తి కాదు. దీంతో, ఈ ఏడాది మరింత సమన్వయంతో ఉత్సవాలు మరింత ఉత్సాహంగా సాగుతాయని అంతా భావించారు. కానీ, ప్రారంభ సభ ఒకింత పరాభవాన్ని మూటగట్టింది. వాస్తవానికి ఉత్సవ ప్రారంభ సూచికగా తొలిరోజు అమ్మవారి ఆలయం నుంచి కోట మీదుగా ఆనంద గజపతి ఆడిటోరియానికి చేరుకుని అక్కడ ప్రారంభ సభ నిర్వహించడం దశాబ్దాల తరబడి ఆనవాయితీగా సాగుతోంది. ఎండైనా, వానైనా ఇబ్బంది ఉండేది కాదు. దీనికితోడు సభ ప్రారంభ సూచికగా గీతాలాపన, నృత్యకళారూపాలు నిర్వహించేందుకు ఈ వేదిక ఎంతో అనువుగా, సౌకర్యవంతంగా ఉంటుంది. వచ్చిన అతిథులూ కాసేపు తిలకించేవారు. అనంతరం జరిగిన సభలో సందేశాలతోపాటు అతిథులను గౌరవించుకోవడం సంప్రదాయంగా నడిచేది. ఈసారి ఇందుకు భిన్నంగా విశాలమైన అయోధ్య మైదానంలో ప్రారంభ సభ పెట్టారు. సభికులకు షామియానా కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో, అరకొరగా వచ్చిన జనం కూడా వేదిక వద్దకు వచ్చే అవకాశం లేకుండా అప్పటికప్పుడు బారికేడ్లతో దారి బంధించారు. దీంతో, సభ ప్రారంభంలో స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతుండగానే వెనుదిరిగారు. సభకు ముఖ్య అతిథిగా వచ్చిన శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు శ్రీనివాస్, సంధ్యారాణి మాట్లాడినప్పుడు ప్రాంగణంలో ఒక్కరూ కనిపించలేదు. అతిథులు ఆశీనులైనంత వరకు నిర్వాహకులు వేదికపైకి స్వాగతం పలకకపోవడం మరింత ఆశ్చర్యపర్చింది.

స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతున్న సమయంలో ఖాళీగా ఉన్న సభా ప్రాంగణం

ర్యాలీ ప్రారంభమూ ఆలస్యమే

ఆదివారం ఉదయం 8.45 గంటలకు పైడితల్లమ్మ ఆలయం నుంచి ఉత్సవ ర్యాలీ ప్రారంభిస్తామని ముందుకు ప్రకటించారు. అధికారులు, అతిథుల ఆలస్యంతో 9.45 గంటల వరకు ముందుకు కదల్లేదు. అప్పటికే ఎండ తీవ్రత ఎక్కువైంది. ఎన్నో కళా బృందాలు ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చినప్పటికీ వారందర్నీ అనుసంధానం చేయడంలో అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు విఫలమయ్యారు. దీంతో, అయోధ్య మైదానంలో ఏర్పాటుచేసిన సభకు ప్రారంభమయ్యే సరికి 10.30 గంటలు దాటిపోయింది. అక్కడ నిలువ నీడ కల్పించకపోవడంతో జనం వెనుదిరిగారు. ప్రణాళిక లోపభూయిష్టం, సమన్వయ లోపం వల్లే ప్రారంభోత్సవంలో పరాభవం ఎదురైందని జనం చర్చించుకుంటున్నారు.

సర్వాంగ సుందరం.. నగరం

ఎంఆర్ కళాశాల కూడలిలో విద్యుత్ కాంతుల మధ్య బుద్ధుడు


కాంతులీనుతున్న సంతకాల వంతెన

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

పైడితలమ్మ సిరిమానోత్సవానికి నగరమంతా సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య ఆదేశాలతో అధికార యంత్రాంగం, సిబ్బంది నగరాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రాశస్యమన్న చారిత్రక కట్టడాలతో పాటు నగరపాలక సంస్థ కార్యాలయం, ప్రధాన కూడళ్ళు, విద్యుత్ దీప కాంతులతో దగదగా మెరిసిపోతున్నాయి. ఫౌంటెన్లు డివైడర్లు, ప్రధాన జంక్షన్లు విద్యుత్ కాంతులతో కాంతులీనమయ్యాయి.

జమ్ముకు వెళ్లే రహదారిలో దగదగ మెరిసిపోతున్న విజయనగరం నేమ్ బోర్డు

విద్యుత్ కాంతులతో గంటస్థంభం

ఆందోళన చేస్తున్న రైతులు

లీటరుకు రూ.10 అదనంగా పెంచాలి

ప్రజాశక్తి - కొత్తవలస

రాష్ట్రంలో పాల సేకరణ కనీస ధర పైన లీటరకు పది రూపాయలు పెంచాలని పాల రైతులు డిమాండ్ చేశారు. ఆదివారం నిమ్మలపాలెం గ్రామ పంచాయతీలో గల పాల ఉత్పత్తిదారుల భవనం వద్ద ఆందోళన చేపట్టారు. పాల రైతుల సమస్యలు పరిష్కారం కోరుతూ అక్టోబర్ 18వ తేదీన జామి మండలంలో సదస్సు ఏర్పాటు చేస్తున్నామని నాయకులు గాడి అప్పారావు తెలిపారు. ఈ సదస్సుకు పాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సదస్సులో పాల రైతుల సమస్యలు, గిట్టుబాటు ధర పలు అంశాలపై చర్చిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాల రైతులు పాల్గొన్నారు.

17 నుంచి టైలరింగ్ ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - బొబ్బిలి

తారకరామకాలనీలో ఉన్న అభిమాని ఫౌండేషన్ కార్యాలయంలో ఈనెల 17 నుంచి ఉచిత టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు అభిమాని ఫౌండేషన్ అధ్యక్షులు రెడ్డి రాజగోపాలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు 9490789555 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

4 గంటలు ఆలస్యంగా మ్యూజికల్ నైట్

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం ఉత్సవాల్లో అడుగడుగునా అధికారుల వైఫల్యం కనిపిస్తోంది. అయోధ్య మైదానంలో సాయంత్రం నాలుగు గంటలకు మ్యూజికల్ నైట్ ప్రారంభిస్తామని ముందస్తుగా అధికారులు ప్రకటించారు. ఆ సమయానికి భారీగా జనం చేరుకున్నారు. కానీ ఎమ్మెల్యే, కలెక్టర్ వచ్చాకే ప్రారంభిస్తామని నిర్వాహకులు చెప్పారు. రాత్రి 8 గంటల వరకూ ప్రారంభం కాకపోవడంతో ప్రేక్షకుల ఆగ్రహం వ్యక్తంచేశారు.

రత్నకుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

సిబిఎం స్కూల్ అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఎమ్మెల్యే బేబీ నాయన చొరవ తీసుకుని స్కూలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన స్కూల్ కరెస్పాండెంట్ రత్న కుమార్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఒక ప్రకటనలో కోరారు. సిబిఎం స్కూల్ ఎంతో చారిత్రకమైన పేరుగల అలాంటి స్కూలును గుప్పిట్లోకి తీసుకోవడానికి తప్పుడు రిజిస్ట్రేషన్ చేయడం దుర్మార్గమన్నారు. సిబిఎం స్కూల్ వ్యవహారంపై స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి స్కూల్ అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి న్యాయం చేయాలని కోరారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - బొబ్బిలి

శ్వేతాచలపతి స్కూల్ 2017-18 బ్యాచ్ విద్యార్థులు యశ్వంత్, అమృత మరణించడంతో వారి స్మారకార్థం ఇందిరమ్మ కాలనీలో పేదలకు దుస్తులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేసి అన్నదానం చేశారు. తమతో చదువుకున్న స్నేహితుల జ్ఞాపకార్థంగా పేదలకు అండగా ఉండడం ఎంతో ఆనందంగా ఉందని ప్రజాహిత మండలి అధ్యక్షులు విల్సన్ బాబా, ఎస్.సత్తిబాబు అన్నారు. సామాజిక కార్యక్రమాలలో విద్యార్థులు ముందుండాలని కోరారు.

ఎన్నికలకు జాబితా తయారు చేయండి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

నీటిసంఘాల ఎన్నికలకు ఓటర్ల జాబితా తయారు చేయాలని తహశీల్దార్ ఎం. శ్రీను వీఆర్‌ఒలకు ఆదేశాలు జారీచేశారు. ఆదివారం తన కార్యాలయంలో వీఆర్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల, పట్టణ పరిధిలో 13 ఇరిగేషన్ చెరువులు, ఐదు మీడియం ఇరిగేషన్ ఆయకట్టు సంఘాల రైతులను ఓటర్ నమోదుగా చేయాలని సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులంతా ఓటర్ల జాబితా తయారు చేయడానికి సిద్ధం కావాలన్నారు. సమావేశంలో ఎన్నికల ఉప తహశీల్దార్ గౌరీ శంకర్, పాల్గొన్నారు.

పట్టణ నిరాశ్రయుల కేంద్రానికి వితరణ

ప్రజాశక్తి-విజయనగరం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణ నిరాశ్రయుల కేంద్రానికి ఆదివారం విశ్రాంత డిప్యూటీ తహశీల్దార్ డి.చంద్రశేఖర్ సుమారు రూ.5 వేలు విలువైన హాట్ బాక్స్‌ను అందించారు. పారాదీప్ ఫాస్పేట్ కంపెనీ లిమిటెడ్ విశ్రాంత ఇంజినీర్ ఎం.సత్యనారాయణమూర్తి మూడు వేల రూపాయలు విలువైన రెండు ఫ్యాన్లు విరాళంగా అందించారు.

ప్లాస్టిక్‌ను నియంత్రించండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లమ్మ పండగ సందర్భంగా ప్రసాద వితరణలో ప్లాస్టిక్‌ను వినియోగించ వద్దని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. తొలేళ్ల ఉత్సవం, సిరిమాను సంబరం జరిగే రోజుల్లో భక్తులకు వివిధ ప్రాంతాల్లో అనేకమంది ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపడుతుంటారని తెలిపారు. కేవలం విస్తరాకులతో గాని, పేపర్ ప్లేట్లలో గానీ ప్రసాదాలను భక్తులకు అందించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగానికి తావు లేదని స్పష్టం చేశారు. ప్రసాద వితరణ చేపడుతున్న ప్రాంతాలలో ప్రత్యేకంగా డస్ట్‌బిన్లను నిర్వాహకులే ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులకు తావు ఇవ్వకూడదని తెలిపారు. రహదారులపై విచ్చలవిడిగా చెత్తా చెదారాలను వేయవద్దని, క్లీన్ జాతరగా చేపట్టే ప్రక్రియలో ప్రతిఒక్కరూ పాలుపంచుకోవాలని విజ్ఞప్తిచేశారు.

సముద్రంలో యువకుడు గల్లంతు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని చింతపల్లి సముద్రంలో ఆదివారం గరివిడి మండలం దుమ్మెదకు చెందిన ఇజ్జపురపు అచ్యుతరావు (25) గల్లంతయ్యాడు. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం దుమ్మెద నుంచి దేవి విగ్రహం నిమజ్జనం నిమిత్తం సముద్రంలో దిగారు. ఆ సమయంలో కొట్టుకుపోయినట్లు కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. సముద్రంలో పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు.

డిఎస్‌సి ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

డిఎస్‌సి ఉచిత శిక్షణకు ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.రామానందం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత బోధన, ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. http://jnanabhumi.ap.gov.in ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థులు దరఖాస్తు నమోదు చేసుకొనేందుకు ఈ నెల 21 వరకు అవకాశం ఉందని తెలిపారు. ఎస్‌జిటిలకు ఇంటర్మీడియట్‌తో పాటు డైట్‌సెట్, టెట్, స్కూల్ అసిస్టెంట్లకు డిగ్రీ, బిఇడి, టెట్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థుల వార్షికాదాయం రూ.2.50 లక్షల లోపు ఉండాలని చెప్పారు.

పిఎంజె జ్యువెలరీ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి- విజయనగరం

నగరంలో పిఎంజె జ్యువెలరీ షోరూమ్‌ను ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి దసరాను పురష్కరించుకుని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దక్షిణ భారతం, అమెరికాలో ఉన్న పిఎంజె 39 పైగా స్టోర్లలో ఇది కొత్తదన్నారు. ఇటువంటి షోరూమ్ విజయనగరంలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఒక కస్టమర్‌గా విజయనగరంలోని ఆభరణాల ప్రియులందరినీ ఈ స్టోర్ ఆకర్షిస్తుందని తాను హామీ ఇస్తున్నానని చెప్పారు. పిఎంజె జ్యువెల్స్ తమ వినియోగదారులకు అత్యుత్తమ అనుభవాన్ని అందించగలదని తాను నమ్ముతున్నానని అన్నారు. దీనికి ముందు పిఎంజె జ్యువెల్స్ ఆంధ్రప్రదేశ్ అధినేత హైదర్ అలీ, డైరెక్టర్ ఆనంద్ జిలగం, విజయనగరం స్టోర్ మేనేజర్ బి. అనంత్ కుమార్‌తో కలిసి ఆమె ఈ కొత్త స్టోర్‌ని ప్రారంభించారు. విజయనగరం, చుట్టు పక్కల ప్రాంతాలలోని వినియోగదారుల విభిన్న అభిరుచులను దృష్టిలో ఉంచుకుని ఈ షోరూమ్‌ను ప్రత్యేకంగా రూపొందించారు. ఇది వజ్రాలు, బంగారం, విలువైన రాళ్లలో విస్తృత శ్రేణి డిజైన్లను కలిగి ఉంటుంది. పిఎంజె అత్యుత్తమ, మునుపెన్నడూ చూడని డిజైనర్ ఆభరణాల శ్రేణి హస్తకళాకృతులతో పాటు ప్రాంతీయ నిర్దిష్ట, వివాహ ఆభరణాలు, ఆఫీస్, పార్టీ, సాధారణ రోజువారీ వినియోగానికి అనువైన తేలికపాటి క్రియేషన్లు ఈ స్టోర్‌లో లభ్యమవుతాయని నిర్వాహకులు చెబుతున్నారు. విజయనగరం స్టోర్ మేనేజర్ అనంత్ కుమార్ మాట్లాడుతూ తమ కొత్త స్టోర్‌లో మంత్ర ముగ్ధులను చేసే ఆభరణాల డిజైన్‌ల భారీ ప్రదర్శనను ఆస్వాదించడానికి ప్రతి ఒక్కరినీ ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

నగలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే అదితి

అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

మంద కృష్ణ మాదిగ

ప్రజాశక్తి - రామభద్రపురం

యువత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని వారి ఆశయ సాధనకు కృషి చేయాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ పిలుపు నిచ్చారు. మండల పరిధిలోని ఆరికతోట గ్రామంలో శనివారం రాత్రి దళిత యువత ఏర్పాటు చేసిన అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని కొనియాడారు. ఆనాడు వారు తీసుకువచ్చిన రాజ్యాంగ సూత్రాలు నేటికీ అమలు కావడం వారి దార్శినికతకు నిదర్శనమన్నారు. ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైందన్నారు. ఈ వర్గీకరణతోనే మాదిగ యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. దీనిపై ఇప్పటికే అన్ని రాష్ట్రాలు ఆమోదం తెలిపాయని, వర్గీకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. ముఖ్యంగా మాదిగలంతా ఐకమత్యంతో రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రశ్నించే తత్వం అలవరచుకొని చదువులో ముందంజలో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువత, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

మినీ బ్యాంకు దొంగ అరెస్టు

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రం బైపాస్ జంక్షన్ సమీపంలో ఉన్న ఎస్‌బిఐ ఖాతాదారుల సేవాకేంద్రంలో దోపిడీకి యత్నించిన దొంగను ఎస్‌ఐ వెలమల ప్రసాద్ చాకచక్యంగా పట్టుకొని కేసు నమోదు చేశారు. దీనిపై ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. ఈ ఏడాది మే18న ఎస్‌బిఐ సేవా కేంద్రంలో దొంగ చొరబడి ల్యాప్ ట్యాప్‌తో పాటు రూ.1.62 లక్షల నగదు చోరీ చేశాడు. దర్యాప్తు చేసి ఈ నేరానికి పాల్పడిన మెంటాడ మండలం పోరాం గ్రామానికి చెందిన జోగాడ భగవాన్ (21) శనివారం అనుమానాస్పదంగా సంచరిస్తుండగా స్థానిక సాయి శ్రీనివాస లాడ్జి వద్ద అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. ఇతడు చిన్న వయసు నుంచే నేర ప్రవర్తన కలిగి పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. గతంలో ఆరికతోటలో కూడా ఇదే తరహాలో ఒక ఇంట్లో చోరీ చేసి కొంత బంగారాన్ని దోచాడు. ఇప్పుడు అవే బంగారు ఆభరణాలు, ల్యాప్ టాప్‌తో పట్టుబడినట్లు ఎస్‌ఐ వెల్లడించారు. భగవాన్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి సాలూరు కోర్టుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దేవునినెలివాడలో చోరీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం పంచాయతీ పరిధిలోని దేవునినెలివాడలో శనివారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు, పోలీసులు అందించిన వివరాల ప్రకారం దేవుని నెలివాడకు చెందిన దంతినాడ ఉమా మహేశ్వర రావు దసరా పండుగకు తన అత్తారిల్లు రామతీర్థం వెళ్ళి శనివారం రాత్రి తన ఇంటికి వచ్చేసరికి తులం పావు బంగారం, కొంత నగదు చోరికి గురైనట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో స్థానిక పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ బి.గణేష్ క్లూస్ టీంని రప్పించి విచారణ జరిపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి- బొబ్బిలి

పశ్చిమగోదావరి జిల్లా కాళ్ళ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతబొబ్బిలి గ్రామానికి చెందిన రౌతు వరలక్ష్మి(59) మృతి చెందారు. వరలక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి భీమవరం కారులో వెళ్తున్నారు. కాళ్ళ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ లైటింగ్ కళ్లకు తగలడంతో రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు కారు ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవింగ్ చేస్తున్న కుమారుడు ఆర్.కె.నాయుడుతో పాటు మరొకరు స్వల్పంగా గాయపడ్డారు.

మూలకు చేరిన తాగునీటి పథకం

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక పిహెచ్‌సికి వైద్యం నిమిత్తం వచ్చిన రోగులు, వారి బంధువులకు స్వచ్ఛమైన నీరు అందించాలనే లక్ష్యంతో నాడు నేడు నిధులతో ప్రభుత్వ తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేసింది. అయితే ఇది కొద్ది కాలానికే మూలకు చేరింది. సంబంధిత కాంట్రాక్టర్‌ను పలుమార్లు సంప్రదించగా చేసిన పనులకు పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించినందున ఏ పని చేయలేకపోతున్నానని బిల్లులు మంజూరు అయితే తప్ప తాగునీటి సమస్య పరిష్క చేయడం తన వల్ల కాదని తెలిపారు. చేసేది లేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు బయటికి వెళ్ళి తాగునీటి ప్యాకెట్లు, బాటిళ్ళు కొనుక్కోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని రోగులు కోరుతున్నారు.

పనిచేయని తాగునీటి పథకం ఇదే

అనుమతులు లేకుండానే నిర్మాణాలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కొండ గంగుపూడి రెవెన్యూ పరిధిలో జిరాయితీ భూములు, ప్రభుత్వ భూములను కూడా ఆక్రమించి ఇష్టారాజ్యంగా దర్జాగా గ్రీన్ డిజిటల్ వ్యాలీ పేరిట పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపడు తున్నారు. ఇందులో భాగంగా ప్రత్యేకంగా ఒక భారీ గేటును ఏర్పాటు చేసి లోపల రక రకాల భవనాలు నిర్మిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు రాత్రి బాగాన విలాసవంతమైన జీవితం గడిపేందుకు వీలుగా ఇక్కడ ఎటువంటి అనుమతులూ లేకుండా భవ నాలను నిర్మిస్తున్నారు. కనీసం గ్రామ పంచాయతీ ఆమోదం కూడా లేకుండా రోడ్లు నిర్మించేస్తున్నారు. గత వైసిపి, ప్రస్తుతం కూటమి నాయకులు అండదండలతోనే అక్రమార్కులు దర్జాగా స్థలాలను కబ్జా చేసి భవనాలు నిర్మించేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరేందుకు సెల్‌ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

విశిష్ట విజయనగరం

ఈ గడ్డ, మన గడ్డ, విజయనగరం గడ్డ.
చారిత్రిక యుద్ధాలు చేసినట్టిన గడ్డ,
స్వాతంత్ర సమరానికి నడుం బిగించిన గడ్డ,
హరిజనోద్ధరణకు గాంధీ వెనుక నడిచిన గడ్డ,
పలు ప్రజా సమస్యలపై పోరాడిన పోరుగడ్డ.
మన గడ్డ..విజయనగరము గడ్డ.

బొబ్బిలి, చందుర్తి, పద్మనాభ,
యుద్ధాలు చేసినట్టి గడ్డ,
విజయరామ, ఆనంద గజపతుల
కీర్తి పతాకాలు ఎగరేసిన గడ్డ,
మన గడ్డ...విజయనగరం గడ్డ.

ఆనంద గజపతి దర్బారులో
నిత్యం కవితా గోష్టి జరిపిన గడ్డ,
విజయ రామ గజపతులు
విద్యా నిలయాలు స్థాపించిన గడ్డ,
మన... విజయనగరము గడ్డ.

కోరిన కోరికలు తీర్చు, కల్పవల్లి
ఇలవేల్పు మన పైడితల్లి
అరణ్యవాసాన, రాముడు నడయాడిన తీర్థం,
మన రామతీర్థం
రామ బాణాకృతిలో, రామాయణాన్ని
వివరించిన, మన రామనారాయణం,
వేలాదిగా అక్షరాభ్యాసం చేసుకుంటున్న
చదువుల తల్లి సరస్వతి క్షేత్రం,
సాంప్రదాయాలకు వారసత్వంగా నిలిచిన గడ్డ,
మన గడ్డ...విజయనగరం గడ్డ.

సమాజ పరివర్తన క్రమానికి ఆధునికతను
అద్దిన గురజాడ,
వ్యవహారానికి, నాంది పలికి ముందడుగు
వేసిన గిడుగు,
నూతన పోకడలతో కథలల్లిన చాసో,
సాహిత్య సారస్వత మందించిన ఆరుద్ర,
నడయాడి సమాజాన్ని కదిలించిన గడ్డ,
మన గడ్డ...విజయనగరం గడ్డ.

విశ్వవీధిలో వాయులీనములందించిన
ద్వారం,
హరికథకు నాందీ వాచకం పలికిన ఆదిభట్ల,
మృదు మధుర సుస్వర సవ్వడి చేసిన
ఘంటసాల,
కోకిలే అసూయపడే కోయిలమ్మ మన
సుశీలమ్మ,
నవరసాల సవ్వడి చేసిన రసాలూరు
సాలూరు,
సంగీత వినీలాకాశంలో చెరగని ముద్రలు
వేసిన గడ్డ,
మన గడ్డ...విజయనగరం గడ్డ.

విశ్వ వేదికపై నాట్యమాడిన జాలరి సంపత్,
జనహృదిని ఉర్రూతలూగించిన కుమ్మరి
మాస్టర్,
క్రికెట్ మేటీ దిగ్గజం సర్ విజ్జి,
మల్ల యోధుడు కోడి రామమూర్తి
కీర్తి, ప్రతిభలు చాటిన గడ్డ.
మనగడ్డ ...విజయనగరము గడ్డ.

పూసపాటి పాలకులు, స్వాతంత్ర
సమరయోధులు, సంస్కృతాంధ్ర పండితులు,
శాస్త్ర విజ్ఞాన ఘనులు, ప్రజా రంజక
పాలకులు,
నడియాడి కీర్తినీ పొంది,
జాతిని పునీతనం చేసినగడ్డ.
మన గడ్డ...విజయనగరం గడ్డ

అందరూ మహానుభావులే,
అందరికీ వందనములు.
సర్వేజనా సుఖినోభవంతు,
సర్వత్రా అభివృద్ధి ప్రాప్తిరస్తు.

- డాక్టర్. జివిఎస్ జయపాలరావు
అధ్యాపకులు, విజయనగరం
9492020115.

సిరిమానోత్సవానికి పటిష్ట బందోబస్తు

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

పైడితల్లమ్మ సిరిమానోత్సవానికి పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లుగా ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిమానోత్సవాన్ని శాంతియుతంగా నిర్వహించేందుకు బందోబస్తును 25 సెక్టార్లుగా విభజించి, సుమారు 2 వేల మంది పోలీసులతో రెండు షిఫ్టులుగా విధులు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాం. ప్రధాన ఆలయం, వనంగుడి వద్ద సిబ్బంది మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తారు. బందోబస్తులో ఇద్దరు అదనపు ఎస్‌పిలు, 11 మంది డిఎస్‌పిలు, 61మంది సిఐలు, ఆర్‌ఐలు, 147 మంది ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలతోపాటు, 17 మంది మహిళా ఎస్‌ఐలు, 425 మంది ఎఎస్‌ఐలు, హెచ్‌సిలు, 670 మంది కానిస్టేబుళ్లు, 136 మంది మహిళా కానిస్టేబుళ్లు, 369 మంది హోంగార్డులు, 200 మంది ఆర్మ్‌డ్ రిజర్వు, ఎస్‌టిఎఫ్ పోలీసు సిబ్బంది బందోబస్తులో ఉంటారు. బందోబస్తును కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షించేందుకు అదనపు ఎస్‌పిని నియమించాం. బందోబస్తు విధులకు పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, విశాఖపట్నం సిటీ, ఇతర జిల్లాల నుంచి కూడా పోలీసు అధికారులు, సిబ్బంది వస్తున్నారు.

సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

కమాండ్ కంట్రోల్ రూం

పైడితల్లమ్మ దేవాలయం ఎదురుగా తాత్కాలికంగా కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేస్తున్నాం. సిరిమాను తిరిగే ప్రాంతాలను, సిరిమాను తీసుకొచ్చే మార్గంలోను, ఇతర ముఖ్య కూడళ్లలో 80 సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం. బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందికి కూడా బాడీ వార్న్ కెమెరాలను ఇస్తున్నాం. భద్రతను నిరంతరం పర్యవేక్షించేలా మూడు డ్రోన్ కెమెరాలు కూడా వినియోగిస్తున్నాం.

రూఫ్ టాప్‌లు ఏర్పాటు

సిరిమాను తిరిగే మార్గంలో ముందుగా గుర్తించిన ప్రాంతాల్లో రూఫ్‌టాప్‌లలో పోలీసులను నియమించి, నిఘా ఏర్పాటు చేస్తున్నాం. ఇక్కడ విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది బైనాక్యులర్స్‌తో సిరిమాను తిరిగే ప్రాంతాలను పరిశీలిస్తూ, అవసరమైన సమాచారాన్ని కమాండ్ కంట్రోల్ రూంకు తెలియజేస్తారు. సిరిమాను తిరిగే ప్రాంతాలకు దగ్గరలో శిథిలావస్థలో ఉన్న 11 భవనాలను గుర్తించి, ఆయా భవనాలపైకి ఎవరినీ అనుమతించవద్దని, యజమానులకు నోటీసులు జారీ చేశాం.

వాహనాల రాకపోకల నిషేధిత ప్రాంతాలు

సిరిమానోత్సవం రోజు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు తొమ్మిది ప్రాంతాల్లో అన్ని రకాల వాహనాల రాకపోకలనూ నిషేధించాం.

- బాలాజీ జంక్షన్ నుంచి సింహాచలం మేడ జంక్షన్ వరకు
- సింహాచలం మేడ జంక్షన్ నుంచి కోట జంక్షన్ వరకు
- బాలాజీ జంక్షన్ నుంచి గంట స్తంభం వరకు
- ఎంఆర్ కాలేజ్ జంక్షన్ నుంచి గురజాడ సర్కిల్ వరకు
- కన్యకా పరమేశ్వరి గుడి నుంచి గంట స్తంభం వరకు
- టాక్సీ స్టాండు నుంచి గంట స్తంభం, ఎంజి రోడ్డు వరకు
- సామ్రాట్ లాడ్జి జంక్షన్ నుంచి శివాలయం మీదుగా ఎంజి రోడ్డు వరకు
- కమ్మవీధి జంక్షన్ నుంచి మూడు లాంతర్లు జంక్షన్ వరకు
- గుమ్చి జంక్షన్ నుంచి కోట జంక్షన్ వరకు రాకపోకలను నిషేధించాం.

నేరాల నియంత్రణకు ప్రత్యేక క్రైం బృందాలు

నేరాలను నియంత్రించేందుకు నేరస్తులను గుర్తించుటలో అనుభవజ్ఞులైన 44మంది క్రైమ్ అధికారులు, సిబ్బందితో 20 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ఈ బృందాలు ఆలయం, రద్దీ ప్రాంతాల్లో మఫ్టీలో తిరుగుతూ జేబు, గొలుసు దొంగతనాలు జరగకుండా చర్యలు చేపడతాయి.

పోలీసు సేవాదళ్

భక్తులకు సహాయ, సహకారాలు అందించేందుకు 25 మందితో పోలీసు సేవాదళ్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నాం. వృద్ధులు, గర్భిణులు, వికలాంగులకు దర్శనం చేయించుటలో సహకారాన్ని సేవాదళ్ పోలీసులు అందిస్తారు. ఈవ్ టీజింగు చేసే ఆకతాయిల భరతం పట్టేందుకు 24 మందితో ప్రత్యేకంగా షీ టీమ్స్‌ను ఏర్పాటు చేశాం.

వాహనాల పార్కింగు ప్రాంతాలు ఇవే..

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకంగా 700మంది పోలీసు సిబ్బందిని, అధికారులను కేటాయించి, నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపడతాం. వివిధ ప్రాంతాల నుంచి నగరంలోకి వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసేందుకు గాను 18 చోట్ల పార్కింగు ప్రాంతాలను ఏర్పాటు చేశాం. రాజీవ్ స్టేడియం, రాజమన్నార్ టెంపుల్, డిఎస్‌డిఒ ఇన్ డోర్ స్టేడియం, అయ్యకోనేరు గట్టు (మున్సిపల్ పార్కు), ఫోర్టు సిటీ స్కూలు రోడ్, ఎస్.వి.ఎన్. నగర్, కాశిరాజు ఎగ్జిబిషను గ్రౌండు, అయోధ్య మైదానం, ఎం.ఆర్ కాలేజ్ హాస్టల్, పెద్ద చెరువు, గురజాడ కళా క్షేత్రం, టి.టి.డి. కళ్యాణ మండపం, సి.ఎం.ఆర్. జంక్షను వద్ద గల పెద్ద చెరువు గట్టు, రైల్వే స్టేషను, టింబర్ డిపో దగ్గర గల పెద్ద చెరువు గట్టు, రామానాయుడు రోడ్డు, ఎంఆర్ కాలేజ్ వద్ద గల ఎలక్ట్రికల్ సబ్ స్టేషను, ఎం.ఆర్.కాలేజ్ వద్ద పార్కింగ్‌కు అవకాశం కల్పిస్తున్నాం.

వాహనాలను ఇలా మళ్లిస్తాం..

పాలకొండ, రాజాం, చీపురుపల్లి, నెల్లిమర్ల, గరివిడి, గుర్ల మీదుగా వచ్చే వాహనాలను కొత్తపేట నీళ్ళ ట్యాంకు, రింగు రోడ్డు, దాసన్నపేట, ఐస్ ఫ్యాక్టరీ మీదుగా మళ్ళిస్తాం.

శ్రీకాకుళం, డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం మీదుగా వచ్చే వాహనాలను రాజీవ్ నగర్ జంక్షను, దాసన్నపేట జంక్షను, ఐస్ ఫ్యాక్టరీ మీదుగా మళ్ళిస్తాం.

విశాఖపట్నం, భోగాపురం, డెంకాడ, ఆనందపురం, భీమిలి మీదుగా వచ్చే వాహనాలను చెల్లూరు, ప్రదీప్ నగర్, ధర్మపురి జంక్షను, ఐస్ ఫ్యాక్టరీ మీదుగా మళ్ళిస్తాం.

ఎస్.కోట, గంట్యాడ, సాలూరు, గజపతినగరం, రామభద్రపురం, పార్వతీపుం మీదుగా వచ్చే వాహనాలను కలెక్టరాఫీసు జంక్షను, గణేష్ టెంపుల్, సి.ఎం.ఆర్. జంక్షను మీదుగా మళ్ళిస్తామని ఎస్‌పి తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, అనకాపల్లి క్రైమ్స్ అదనపు ఎస్‌పి ఎల్.మోహనరావు, విజయనగరం డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కె.చౌదరి, టి.శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులతో సంయమనం పాటించండి

పైడితల్లమ్మ పండగ సందర్భంగా బందోబస్తు నిమిత్తం వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి నిర్వహించాల్సిన విధి నిర్వహణ, తీసుకోవాల్సిన భద్రత చర్యలపై ఎస్‌పి వకుల్ జిందాల్ దిశానిర్దేశం చేశారు. బందోబస్తు, భద్రత విధులు నిర్వహించేందుకు జిల్లా కేంద్రానికి విచ్చేసిన పోలీసు అధికారులు, సిబ్బందితో పోలీసు పరేడ్ గ్రౌండులో ఎస్‌పి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పండగను తిలకించేందుకు వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి ప్రజలు జిల్లాకు వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులు, ప్రజలతో మాట్లాడే సమయంలో సంయమనం పాటించాలని, ఏదైనా ఇబ్బందులు తలెత్తితే ఇన్‌ఛార్జులుగా వ్యవహరించే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమస్యను సానుకూలంగా, సామరస్య పూర్వకంగా పరిష్కరించేలా అధికారులు, సిబ్బంది చొరవ చూపాలన్నారు. ప్రతిఏటా నిర్వహించే పండగ బందోబస్తు విధులేనని, ఎవరూ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని స్పష్టంచేశారు. భద్రతా పరంగా భక్తులకు కచ్చితమైన సూచనలు మాత్రమే చేయాలని, వారితో మర్యాదగా ప్రవర్తించాలని ఆదేశించారు. ఎవరైనా బాధ్యతలను ఉల్లంఘిస్తే, అందుకు బాధ్యులైన వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, అనకాపల్లి క్రైం అదనపు ఎస్‌పి ఎల్.మోహనరావు, డిఎస్‌పిలు ఎం.శ్రీనివాసరావు, ఎస్.రాఘవులు, పి.శ్రీనివాసరావు, ఎం.వీరకుమార్, పి.నాగేశ్వరరావు, సీతారాం, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.